# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **లండన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారత హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామితో సమావేశమైయ్యారు.**
2. **కేంద్రప్రభుత్వ సహకారంతో రాజధాని అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హోంమంత్రి వి. అనిత తెలిపారు.**
3. **రాష్ట్రంలోని దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లను ఉచితంగా అందజేయనున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడించారు.**
4. **వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృష్ణాజిల్లాలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్నారు.**
5. **రాష్ట్రంలో ఈ రోజు జరిగిన వేర్వేరు రహదారి ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు.**

==========================

యునైటెడ్ కింగ్‌డమ్ లోని లండన్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా లండన్‌లోని భారత హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామితో ముఖ్యమంత్రి ఈరోజు మర్యాదపూర్వకంగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా యుకెలోని వివిధ విశ్వవిద్యాలయాలతో జీవశాస్త్రం, బయోజెనెటిక్స్, ఖనిజాల వెలికితీత, లోహాలు వంటి అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటు అంశంపై చర్చించారు. అలాగే విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల మధ్య విద్యార్థుల మార్పిడి అంశం, కృతిమ మేధ- ఏఐ, సెమీ కండక్టర్, అంతరిక్ష సాంకేతికత, కోర్ ఇంజనీరింగ్ వంటి అంశాలపై ఇరువురు చర్చించారు.

--------------------------

కేంద్రప్రభుత్వ సహకారంతో రాజధాని అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హోంమంత్రి వి. అనిత తెలిపారు. గుంటూరు జిల్లాలోని రాజధాని గ్రామమైన తుళ్లూరులో నూతనంగా నిర్మించిన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్-డీఎస్పీ కార్యాలయాన్ని ఆమె ఈరోజు ప్రారంభించారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ, రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం వల్లే రాజధాని నిర్మాణం జరుగుతోందన్నారు. అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని మంత్రి తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లను ఉచితంగా అందజేయనున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. దివ్యాంగులకు ఉపయోగపడేలా 1750

మోటార్ సైకిళ్ళను ప్రభుత్వం అందజేయనుందని, ఈ మేరకు అర్హులైన వారు ఈ నెల 25వ తేదీలోపు ఆన్ లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, 10 వతరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధితో జీవించేవారు, 18 నుంచి 45 ఏళ్ల లోపు, 70 శాతం అంగవైకల్యం గలవారు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు www.apdascac.ap.gov.in వెబ్ సైట్ ని సంప్రదించాలని మంత్రి వివరించారు.

---------------------------

వన్ ధన్ వికాస్ కేంద్రాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ సూచించారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంత్యుత్సవాల సందర్భంగా పాడేరులోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ –ఐటిడిఏలో నిర్వహించిన “జన జాతీయ గౌరవ దివస్” కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏ. ఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 106 వన్ ధన్ వికాస్ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా గిరిజనులు పండించే వివిధ రకాల పంటలు, వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ ధరకు కొలుగోలు చేసేలా, వారి జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

---------------------------

అమృత్ రైల్వేసేషన్ల కింద కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తోందని రేణిగుంట రైల్వే ఛీఫ్ ట్రాఫిక్ ఆఫీసర్ చలపతి తెలిపారు. తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ మేనేజర్ మన్మోహన్ కృష్ణతో కలిసి ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం అమృత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైల్వేస్టేషన్‌లో అందుబాటులోకి రానున్న సౌకర్యాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చలపతి మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్నారు. అనంతరం రైతులతో సమావేశమై వివరాలను అడిగి తెలుసుకుంటారు.

---------------------------

రాష్ట్రంలో ఈరోజు జరిగిన వేర్వేరు రహదారి ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. సత్యసాయి జిల్లాలోని రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి వద్ద ట్రక్కును ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, 8 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఇక ఏలూరు జిల్లా లింగపాలెంలోని జూబ్లీనగర్ సమీపంలో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయని జిల్లా రవాణా శాఖ అధికారి కరీం తెలిపారు.

---------------------------

ఏలూరుజిల్లా ప్రమాద ఘటనపై గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి వి.ప్రవీణ్ బాబు కుటుంబానికి ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

---------------------------

విజయనగరం జిల్లాలో 109 నీటిపారుదల చెరువులను 55 కోట్ల రూపాయాలతో అభివృద్ధి చేయనున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చిన్నతరహా నీటిపారుదల చెరువుల అభివృద్ధిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరమ్మతులు, పునరుద్ధరణ పనుల కింద మొదటి విడతలో 44, రెండో విడతలో 49, తాజాగా మూడో విడతలో 16 చెరువులను అభివృద్ధి చేయనున్నామని చెప్పారు.

---------------------------

విద్యార్థులకు చిన్నతనం నుంచే స్వచ్ఛతపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా పాఠశాలల్లో "స్వచ్ఛబడి"ని ప్రారంభిస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ వెల్లడించారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ఆయన నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ తరహాలో కుప్పంలో ప్రథమంగా స్వచ్ఛ దళ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పింఛన్‌ను పొందే ప్రక్రియను సులభతరం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా డిజిటల్ జీవన ప్రమాణ పత్రాన్ని –లైఫ్ సర్టిఫికెట్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని కేంద్ర ప్రభుత్వ పింఛను, పింఛనర్ల సంక్షేమ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవేశ్ కుమార్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలోని ఎస్‌బీఐ ప్రధాన శాఖ, తపాలా శాఖ కార్యాలయాలను ఆయన నిన్న సందర్శించి ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న లైఫ్ సర్టిఫికెట్ నమోదు విధానాన్ని పరిశీలించారు. అనంతరం ప్రవేశ్ కుమార్ మాట్లాడుతూ, పింఛన్ దారులు తమ ఆధార్‌కు అనుసంధానమైన సెల్‌ఫోన్‌లో 'జీవన్ ప్రమాణ్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో ముఖ ఆధారిత విధానంతో జీవన ప్రమాణ పత్రాన్ని సమర్పించవచ్చని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్ 25 సెకన్లు

====================